సాక్షి
జనగామ
సోమవారం, 3, జూలై, 2023



స్టాంప్ పేపర్ల దందా
భూక్రయవిక్రయాల్లో ముఖ్య భూమిక పోషించే స్టాంప్ పేపర్ల దందా జోరుగా సాగుతుంది. పాత స్టాంప్ పేపర్లకు కొత్త ధర తీసుకుంటూ విక్రయిస్తున్నారు. - 8లో



అధికార పార్టీ నాయకుల భూకబ్జా
బచ్చన్నపేట మండలంలోని ఓ వ్యవసాయ భూమిని పలువురు అధికార పార్టీ నాయకులు కబ్జా చేస్తున్నారని బాధితులు వాపోయారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$32^0/25^0$

వాతావరణం
జిల్లాలో పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల చిరు జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

ముదిరాజ్‌లు ఐక్యతతో పనిచేయాలి



చిల్పూరు: ముదిరాజ్ జాతి సమగ్రాభివృద్ధికి ఐక్యతతో పనిచేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్య కార్మిక సహకార సంఘం డైరెక్టర్ నీల రాజు అన్నారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఆదివారం ముదిరాజ్ మత్స్య పారిశ్రామిక సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరం ఐక్యతతో ఉంటే మహాబలంగా మారుతుందని దీని ద్వారా వచ్చే ఎన్నికల్లో రాజ్యాధికారం సంపాదించుకోవచ్చన్నారు. అనంతరం ఇటీవల గాయపడిన ఇట్టబోయిన శ్రీనివాస్‌ను పరామర్శించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ కొడ సంపత్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యూత్ కార్యదర్శి గోరంటల యాదగిరి, మండల నాయకుడు ఊరడి శ్రీనివాస్, యాకరాజ్, పులికాశి రాజయ్య, నరేష్, రవి, యాకయ్య పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమమే ధ్యేయం



జనగామ రూరల్: విశ్వబ్రాహ్మణుల సంక్షేమమే ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు టి. మహేశ్వరా చారి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక మంది విశ్వబ్రాహ్మణ జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడిని శాలువాతో సన్మానించారు. జిల్లా నుంచి రాష్ట్ర కమిటీకి అయిలా సోమనర్సింహా చారి, గుడికందుల కృష్ణకు అవకాశం కల్పించగా సాహిత్య, సాంస్కృతిక విభాగం నుంచి సోమేశ్వరాచారిని నియమించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అనంతోజు శశిధర్, ప్రధాన కార్యదర్శి కొండపర్తి విష్ణు, సహాయ కార్యదర్శి బత్తోజు రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నారోజు వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి



జనగామ రూరల్: ఈ నెల 7న వరంగల్‌లో నిర్వహించే వీహెచ్‌పీఎస్ జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు గద్దం కాసిం తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బిర్రు నగేష్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కాసిం మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని, గృహలక్ష్మి పథకంలో ప్రత్యేక స్థానం కల్పించాలన్నారు. రాజకీయ రిజర్వేషన్లు కల్పించి అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేయాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుమార్, మహేందర్ , నర్సయ్య, రవీందర్, వంశీ, సోమరాజు, సిద్ది రాములు, నరేష్ పాల్గొన్నారు.

వానలు కురవాలని కప్పతల్లి ఆట



చిల్పూరు: మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఆదివారం సకాలంలో వానలు కురువాలంటూ మహిళలు వానమ్మ వానమ్మా .. ఒక్కసారన్న వచ్చిపోవే వానమ్మా.. అంటూ కప్పతల్లి ఆట ఆడారు. ఉదయం గ్రామంలో కప్పను కట్టెకు కట్టి గడపగడపకూ తిరుగుతుండగా ఇంటి యజమానులు నీరు పోశారు. గ్రామంలోని ఆలయాల్లో పూజలు చేసిన అనంతరం బస్టాండ్ సమీపంలో కండ్లకోలు వర్షిత, నిఖిత, గోనెల కల్పన, శివాణి, స్వర్ణలత, నవనీత, రాహుల్, మిల్కి, కనుకవ్వ, సరిత, గాలవ్వ, రాజవ్వ, నీరజ తదితర మహిళలు కప్పను మధ్యలో ఉంచి చప్పట్లతో పాటలు పాడారు.

ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా సుహాసిని

జనగామ రూరల్: జిల్లా భూసేకరణ విభాగం యూనిట్ 1 ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా సుహాసినిని నియమిస్తూ ఆదివారం రాత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ వెయిటింగ్‌లో ఉండగా రెండు మూడు రోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది.

చేప పిల్లల పంపిణీకి సన్నద్ధం

- ముగిసిన టెండరు ప్రక్రియ
- క్షేత్రస్థాయి పరిశీలనే తరువాయి
- జిల్లాలో 732 చెరువులు, రిజర్వాయర్లు
- 2.72 కోట్ల చేప పిల్లల కేటాయింపు

జనగామ: మత్స్యకారుల కుటుంబాల సంక్షేమానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. మత్స్య సంపదను వృద్ధి చేసి వృత్తిదారుల ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు ఉచితంగా చేప పిల్లల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో చెరువులు, రిజర్వాయర్లలో వేయడానికి అవసరమైన చేప పిల్లలకు సంబంధించి జిల్లాల వారీగా ఆన్‌లైన్ టెండరు ప్రక్రియ పూర్తి కాగా.. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత కాంట్రాక్టర్లకు సీడ్‌కు సంబంధించి బిడ్లను అప్పగిస్తారు. జిల్లాలో 732 చెరువులు, రిజర్వాయర్లు ఉన్నాయి. మహిళలు, పురుషులకు సంబంధించి 169 రిజిస్టర్డ్ సొసైటీలు ఉండగా, వాటిలో 16,890 మంది సభ్యులు ఉన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా అందిస్తుండగా.. జిల్లాకు 2,72,39,000 కేటాయించింది. ఇందుకు ప్రభుత్వం ఇటీవల టెండర్లు ఆహ్వానించగా.. ఏపీకి చెందిన కైకలూరు నుంచి ఇద్దరు, తెలంగాణలోని నల్లగొండ, హనుమకొండ, జనగామ జిల్లాలోని నర్మెట, రఘునాథపల్లికి చెందిన మరో నలుగురు.. మొత్తం ఆరుగురు కాంట్రాక్టర్లు ఆన్‌లైన్ బిడ్డింగ్ వేశారు. పీక్యూ స్టేజీ(టెండరుదారుల వివరాల వెల్లడి) పూర్తి కాగా.. టెండరు వేసిన కాంట్రాక్టర్ల చేపల చెరువుల (ఫాం ఇన్‌స్పెక్షన్) క్షేత్రస్థాయి పరిశీలన మిగిలి ఉంది. టెండరు వేసిన కాంట్రాక్టర్లకు చేప పిల్లలను సరఫరా చేసే అర్హత ఉందా.. రెవెన్యూ రికార్డులు, స్టాక్ తదితర వివరాలతో కూడిన నివేదికను జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ) ఆధ్వర్యంలో ఈ ప్రొక్యూర్‌మెంట్‌లో అప్‌లోడ్ చేస్తారు. చేపల చెరువుల సామర్థ్యం.. వాటిలోని లోపాలను సైతం నివేదికలో పొందుపరుస్తారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే విత్తన చేపల పంపిణీ బాధ్యతలను సదరు కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు.

చెరువుల్లో సరిపడా లేని నీరు..

చెరువులు, రిజర్వాయర్లలో 75 శాతం నీరు నిల్వ అయిన తర్వాతే చేప పిల్లలను వదులుతారు. రిజర్వాయర్లలో 80 నుంచి 100 ఎంఎం సైజు కట్ల, రోహు, మ్రిగాల, చెరువుల్లో 35 నుంచి 40 ఎంఎం సైజు కట్ల, రోహు, బంగారుతీగ రకాలు వేస్తారు. 35 నుంచి 40 ఎంఎం రకం లక్ష పిల్లలకు రూ.56,970, 80 నుంచి 100 ఎంఎం సైజు కలిగిన లక్ష పిల్లలకు రూ.1,51,030 ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లిస్తుంది. అయితే.. టెండరు ప్రక్రియ ఫైనల్‌కు చేరినప్పటికీ.. ప్రస్తుతం ఆశించిన మేర వర్షాలు కురవక పోవడంతో చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు అంతగా లేవు.



చీటకోడూరు రిజర్వాయర్

జిల్లాలో చేపల ఉత్పత్తి	ఏడాది	2016-17	2017-18	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
	టన్నులు	3,165	6,813	9,319	8,981	8,994	8,630	7,724



చేపలను పట్టుకు వస్తున్న మత్స్యకారులు

పెరిగిన చేపల ఉత్పత్తి

జిల్లాలో 2016 నుంచి 2023 వరకు రికార్డు స్థాయిలో చేపల ఉత్పత్తి పెరిగింది. ప్రభుత్వం ఉచితంగా అందించే సీడ్‌తో పాటు మత్స్యకారులు ప్రైవేటుగా కొనుగోలు చేసి చేపల ఉత్పత్తి చేస్తున్నారు. గడిచిన ఏడు సంవత్సరాల్లో 53,626 టన్నుల చేపల ఉత్పత్తి సాధించారు.

75 శాతం నీరు రాగానే..



జిల్లాలో చేప పిల్లలకు సంబంధించిన ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ ముగిసింది. కాంట్రాక్టర్లకు సంబంధించి చేపల చెరువులు, చేప పిల్లల సామర్థ్యం, భూమికి చెందిన రెవెన్యూ రికార్డులను పరిశీలించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయి తనిఖీలు పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తాం. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత.. నీటి వనరుల్లో 75 శాతం నీరు రాగానే విత్తన పిల్లలు పంపిణీ చేస్తాం.

- నాగులు, మత్స్యశాఖ జిల్లా అధికారి

పారదర్శకంగా ఈవీఎంల తనిఖీ

జనగామ రూరల్: పారదర్శకంగా ఈవీఎంల తనిఖీ ప్రక్రియ చేపట్టాలని ఎలాంటి సందేహాలు లేకుండా నివృత్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం అబ్జర్వర్ దిద్ది నవీన్ అన్నారు. ఆదివారం కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి మొదటి స్థాయి ఈవీఎంల తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇంజనీర్లు, అలాగే ఎన్నికల సిబ్బందిచే గత నెల 24వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు తనిఖీ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఎన్నికల సంఘం నిమయ నిబంధనల మేరకు జిల్లాలోని అన్ని పార్టీల నాయకులతో జరుగుతుందని ఈ తనిఖీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 వరకు జరుగుతుందని, ఎలాంటి అపోహలకు తావు లేకుండా పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. మొదటి స్థాయి తనిఖీలో భాగంగా 3, 4 తేదీల్లో ప్రతినిధుల సమక్షంతో మాక్ పోలింగ్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు బొట్ల శ్రీనివాస్, రావెల రవి, చెంచారపు బుచ్చిరెడ్డి, అజయ్, జోగు ప్రకాష్, సోమయ్య, జె కుమార్, ఎన్నికల విభాగం తహసీల్దార్ బి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం అబ్జర్వర్

నేడు విద్యుత్ అంతరాయం

జనగామ రూరల్: పట్టణంలోని అభివృద్ధి పనుల నిమిత్తం నూతన లైన్ ఏర్పాటుతో నేడు (సోమవారం) విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ పి.శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సూర్యాపేట రోడ్డు ఎడమవైపు మొత్తం, ప్రిస్టన్ ఏరియా, దుర్గమ్మ గుడి ఏరియా, శ్రీనివాస్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విదుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

జనగామ రూరల్: రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్య హత్య వెనుకాల ఉన్న దోషులను సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంజయ్యభాగ్యలక్ష్మిని జెడ్పీ వైస్ చైర్మన్ నుంచి బర్తరఫ్ చేసి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తన నైతికతను నిరూపించుకోవాలన్నారు. సుభద్ర దారుణహత్య విషయంలో జనగామ సూపరింటెండెంట్ పాత్ర ఉన్నట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు. తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన సుగుణాకర్‌రాజు, డాక్టర్ రాహుల్, ప్రవీణ్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోస్టుమార్టం చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన ప్రామాణికాలు తీసుకోలేదన్నారు. హత్యను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా సిట్టింగ్ జడ్జితో విచారించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగు ప్రకాష్, రాపర్తి రాజు, అహల్య, విజేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కనకారెడ్డి

ఉద్యమకారులకు ప్రాధాన్యం కల్పించాలి

జనగామ రూరల్: తెలంగాణ ఉద్యమంలో అనేక కష్టనష్టాలను ఎదుర్కొని ఇబ్బందులు పడుతున్న ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జూలై 7వ తేదీన చేపట్టే చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమ లక్ష్యాలను నేరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, బడ్జెట్ రూ. 10 వేల కోట్లు కేటాయించాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, తెలంగాణ స్వతంత్ర సమరయోధులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బొల్లపెల్లి కృష్ణ, పరీదుల శ్రీనివాస్, పి.సురేందర్ రెడ్డి, రాంబాబు, సంపత్, సుదర్శన్, పెంటాచారి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు

వీరభద్రుడికి స్థపతి పూజలు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ స్థపతి వల్లినాయగం ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం, స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆలయ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి, ఉప ప్రధాన అర్చకులు వల్లినాయగంకు వివరించారు. దేవస్థాన యాగశాల, అద్దాల మండపం, ఉత్తర రాజగోపుర నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన స్థలాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబు, సదానందం, వీరభద్రయ్య, శ్రీకాంత్, రమేష్, శివకుమార్, శరత్‌చంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల స్థలాన్ని పరిశీలిస్తున్న స్థపతి

ప్రధాని సభ సక్సెస్ చేసి చరిత్ర సృష్టించాలి



ఆర్ట్స్ కళాశాల మైదానంలో హనుమకొండ కలెక్టర్, సీపీతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

- వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే బీజేపీ పోటీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్
- బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు వ్యతిరేకంగా పోరాటం
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

హన్మకొండ/కాజీపేట రూరల్/కేయూ క్యాంపస్/హన్మకొండ కల్చరల్: పేదల రాజ్యం, రామరాజ్య స్థాపనే బీజేపీ లక్ష్యమని, ఈనెల 8న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను సక్సెస్ చేసి చరిత్ర సృష్టించాలని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్‌కు రానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసే బహిరంగ సభ సన్నాహక సమావేశం ఆదివారం హనుమకొండ స్నేహనగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్‌లో జరిగింది. అంతకు ముందు ఉదయం కాజీపేట మండలం అయోధ్యపురం–మడికొండ గ్రామాల సరిహద్దులో ప్రధాని భూమిపూజ చేయనున్న రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, వ్యాగన్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇతర నాయకులతో కలిసి బండి సంజయ్ పరిశీలించారు. అదేవిధంగా బహిరంగ సభ నిమిత్తం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానాన్ని సందర్శించారు. అనంతరం హరిత కాకతీయ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, పేదల ఎజెండాతో బీజేపీ ముందుకు పోతోందని చెప్పారు. త్యాగాల చరిత్ర కలిగిన ఓరుగల్లుకు ప్రధాని మోదీ రాబోతున్న నేపథ్యంలో కనీవినీ ఎరుగని రీతిలో స్వాగతం పలికి చరిత్ర సృష్టిద్దామన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభను విజయ సంకల్ప సభగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తాను.. మాట తప్పితే తల నరుక్కుంటాను' అని చెప్పిన సీఎం కేసీఆర్ తల ఎక్కడ పెట్టుకున్నారని విమర్శించారు. 2018 ఎన్నికలప్పుడు కేంద్రం ఏర్పాటు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పుతుందని.. నిరుద్యోగ భృతి ఇస్తానని.. భూమిలేని దళితులకు మూడెకరాల సాగు భూమి ఇస్తానని చెప్పిన కేసీఆర్.. మాటతప్పారని అన్నారు. ఎన్నికల్లో డబ్బులు పెట్టి గెలవాలని కేసీఆర్ చూస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ అవినీతి పాలనకు వ్యతిరేకంగా బీజేపీ నిలబడి పోరాడుతుందని చెప్పారు. అంతకు ముందు రైల్వే అధికారులు వ్యాగన్ లేఅవుట్‌ను మ్యాప్ ద్వారా వివరించి.. వ్యాగన్ తయారీ పరిశ్రమకు 80 ఎకరాల స్థలం అవసరమని, సదుపాయాలు, సౌకర్యాలు, సిబ్బంది ఖాళీల గురించి చెప్పారు.

కిషన్‌రెడ్డిని కలిసిన భూనిర్వాసితులు

అయోధ్యపురం గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. భూమి కోల్పోతున్న 114 మంది రైతులకు వ్యాగన్‌షెడ్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గాదెం యాదగిరి, మేరుగు రాజయ్య తదితరులు కోరగా.. ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, నాయకులు గరికపాటి మోహన్‌రావు, మర్రి శశిధర్‌రెడ్డి, జి.విజయరామారావు, బంగారు శ్రుతి, పార్టీ హనుమకొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, కీర్తిరెడ్డి, రైల్వే డివిజనల్ మేనేజర్ ఎ.కె.గుప్తా, కలెక్టర్ సిక్తా పట్నాయక్, రైల్వే అధికారులు, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పనులు వేగవంతం చేయండి



వేయిస్తంభాల ఆలయంలో కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

వేయిస్తంభాల దేవాలయం కల్యాణ మండపం పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఆలయాన్ని సందర్శించి రుద్రేశ్వరుడికి పూజలు చేశారు. కల్యాణ మండపం పరిశీలించిన సమయంలో స్థపతి శివకుమార్ ఆలయ పరిస్థితిని వివరించారు. కాగా, ఉత్సవాల సందర్భంగా కార్యక్రమాలు జరుపుకోవడానికి పురావస్తుశాఖ అడ్డు పడుతున్నదని, భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, సిబ్బంది ప్రేమ్‌కుమార్, రజిత తదితరులు మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.


దొడ్డి కొమురయ్య అమరత్వానికి 77 ఏళ్లు

- రేపు సీపీఐ ఆధ్వర్యంలో సంస్మరణ సభ
- డీకే స్మారక సమితి ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ

దేవరుప్పుల: భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఉవ్వెత్తున లేచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరు అంకురార్పణ తొలి రక్తపు చుక్కలు నిప్పురవ్వలా ఎగిసి తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి రాచరికపు పాలనకు చరమగీతం పాడేలా దోహదపడిన దొడ్డి కొమురయ్య తొలి అమరత్వానికి రేపటి (మంగళవారం)తో 77 ఏళ్లు నిండుకోనున్నాయి. నిజాం పాలనలో ఏడో రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు అండగా జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, భూస్వామ్య పెత్తందారి వ్యవస్థ ప్రజలను పీల్చిపిప్పి చేసే క్రమంలో జనగామ జిల్లా పాలకుర్తి మండలం విస్నూర్ దేశముఖ్ రాపాక రామచంద్రారెడ్డి, తల్లీ జానమ్మ దొరసాని ఆకృత్యాలు పెల్లుబికి వెట్టిచాకిరీ, లేవి వసూళ్లు అమలవుతున్న తరుణం ఇదీ. రెండో ప్రపంచ యుద్ధం (1944) సంభవించిన తరుణంలో భారతదేశాన్ని ఏలుతున్న బ్రిటిష్ పాలకులకు మద్దతు ఉన్న నిజాం రాజు ఆహారపు ధాన్యాల సేకరణకు తన పాలన యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ధాన్యం నిల్వ చేసే భూస్వామ్యులను వదిలేసి రైతుల నుంచి బలవంతపు వసూళ్లకు తెరలేపింది. వారి ఆగడాలను అంతమొందించేందుకు నల్లా నర్సింహ్ములు తదితరుల ఆధ్వర్యంలో గుత్తల సంఘాన్ని ఏర్పరచి ప్రతిదాడులకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే 1946 జూలై 4న ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, దొడ్డి కొమురయ్య, మల్లయ్య, మామిడాల యాదగిరి, జంపాల లింగయ్య, రేషపల్లి కొండయ్య, అస్నాల నర్సోజీ తదితరులు గుత్తల సంఘం ఆధ్వర్యంలో దున్నేవాడికి భూమి.. లేవీ ధాన్యం సేకరణ నిలిపివేయాలి.. జై ఆంధ్రమహాసభ.. ఎర్రజెండా జై అంటూ బొడ్రాయి వద్దకు ప్రదర్శనగా చేరారు. ఈ ప్రదర్శనను చూసి బెంబేలెత్తిన మిస్కీని అలీ నేతృత్వంలో దొరల గుండాలు, నిజాం పోలీసులు కాల్పులకు తెగబడగా ముందు వరుసలో ఉన్న దొడ్డి కొమురయ్యకు రక్తపు టేరుల్లో మృత్యువాత పడగా మిగితా సభ్యులు తీవ్ర గాయాలపాలయ్యారు. చరిత్రాత్మక ఉద్యమ చిహ్నానికి సీపీఐ ఆధ్వర్యంలో భారీ స్మారక స్థూపం, భవనం నిర్మించారు.

సీపీఐ ఆధ్వర్యంలో సంస్మరణ సభ

సీపీఐ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వారసత్వం పుణికిపుచ్చుకొనే క్రమంలో ఏటా మాదిరిగా కడవెండిలో రేపు (మంగళవారం) ఉదయం 10 గంటలకు సంస్మరణసభ నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి జీడీ ఎల్లయ్య తెలిపారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, విశ్వేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి తదితరులు రానున్నట్లు ఆయన తెలిపారు. అలాగే దొడ్డి కొమురయ్య స్మారక సమితి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో కడవెండి గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య తొలి స్మారక విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు సమితి ప్రతినిధి దొడ్డి చంద్రం తెలిపారు.



దొడ్డి కొమురయ్యను దేశ్‌ముఖ్‌లు కాల్చిచంపుతున్న ఊహా చిత్రం



కడవెండిలో సీపీఐ నిర్మించిన కొమురయ్య స్మారక భవనం

కొమురయ్య అమరత్వంతోనే పోరాటం ఉధృతం



విస్నూర్ దేశముఖ్ బాబుదొర, జానమ్మ దొరసాని ఆగడాలను అంతమొందించే క్రమంలో కడవెండి దొడ్డి కొమురయ్య అమరత్వంతోనే పోరాటం ఉధృతమైంది. నల్లా నర్సింహ్ములు ఆధ్వర్యంలో ఏర్పాటైన సాయుధ దళాల్లో పనిచేశాం. నల్ల నర్సింహ్ములుతో అరెస్ట్ అయి చంచల్‌గూడ జైలు జీవితం గడిపి విడుదల అయ్యాను.

- జాటోతు ధర్మ్యానాయక్, పదమటితండా, ధర్మాపురం

5 నుంచి కేయూ ఎంపీఈడీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంపీఈడీ–1 సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈ నెల 5 నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. 5న పేపర్ 1 రీసెర్చ్ ప్రాసెస్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్, 7న పేపర్ 2 ఫిజియాలజీ ఆఫ్ ఎక్సర్‌సైజ్, 10న పేపర్ 3 యోగిక్ సైన్స్, 12న నాల్గవ పేపర్ టెస్ట్ మెనేజ్‌మెంట్ అండ్ ఎవాల్యూయేషన్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు గమనించాలని కోరారు.

ముద్రా, జ్వాలామాలినీ క్రమాల్లో పూజలు

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ముద్రా, జ్వాలామాలినీ క్రమాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. అంతకు ముంఉద ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, చతుఃస్థానార్చన పూజలు జరిగాయి. ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కుటుంబసమేతంగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ముద్రా క్రమంలో అమ్మవారు



జ్వాలామాలినీ క్రమంలో అమ్మవారు

వివాహిత కిడ్నాప్

● భర్తపై దాడి

మహబూబాబాద్ రూరల్: ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్న ఓ యువతిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన ఘటన మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ముడుపుగల్ గ్రామానికి చెందిన వీరబోయిన లింగయ్య, జయమ్మ దంపతుల రెండో కుమారుడు ఉపేందర్ జూన్ 24వ తేదీన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన మేకల లింగయ్య, గంగమ్మ దంపతులకుమార్తె అనూషను ప్రేమ వివాహం చేసుకున్నాడు. జిల్లాలోని బయ్యారం మండలం గట్టు ములసమ్మ దేవాలయంలో ప్రేమ వివాహం అనంతరం నవదంపతులు మహబూబాబాద్ రూరల్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఉపేందర్ తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో అనూష తండ్రి లింగయ్య.. మున్న లింగయ్య, కారింగుల గణేష్, ఎర్రబోయిన గణేష్‌తో కలసి ఇంటిపైకి దాడికి వచ్చారు. ఉపేందర్, అనూష ఇంట్లో ఉండగా లోపలికి వెళ్లి ఉపేందర్‌పై కత్తితో దాడి చేసి గాయపర్చి అనూషను తీసుకుని వెళ్లారు. తన భార్య అనూషను కిడ్నాప్ చేసి బంధువులు ఇంట్లోని 6తులాల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదు అపహరణకు గురయ్యాయని ఉపేందర్ తెలిపారు. జరిగిన సంఘటనపై మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని ఉపేందర్ తెలిపాడు.

భర్త ప్రాణం కాపాడిన భార్య



ప్రమాదానికి గురైన సత్యనారాయణ

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని తాళ్లగడ్డ ప్రాంతంలో విద్యుత్ ప్రమాదంలో చిక్కుకున్న భర్తను తన భార్య కాపాడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లగడ్డకు చెందిన బండారి సత్యనారాయణ ఇంట్లో ఒక్కసారిగి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పొగలు కమ్ముకున్నాయి. అయితే సత్యనారాయణ టైలర్‌గా పనిచేస్తుంటాడు. ఈక్రమంలో దుస్తులకు మంటలు అంటుకుంటాయనే ఆందోళనతో వాటిని తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన భార్య సుజాత వెంటనే కర్రతో భర్త చేయిపై కొట్టడంతో ప్రాణాపాయం తప్పింది. సొమ్మసిల్లిన సత్యనారాయణను ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. భార్య ధైర్యంగా సమయస్ఫూర్తిగా వ్యవహరించి భర్త ప్రాణం కాపాడుకుందని స్థానికులు ఆమె ధైర్యాన్ని మెచ్చుకున్నారు. ఇదిలా ఉండగా.. అయితే విద్యుత్ ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని తెలుసుకునేందుకు విద్యుత్‌శాఖ అధికారులకు బాధితులు సమాచారం అందజేశారు. దర్యాప్తు కొనసాగుతోంది.



స్టాంప్ పేపర్ల దందా..

● పాత పేపర్‌కు.. కొత్త ధర
● ఉమ్మడి వరంగల్‌లో జోరుగా..



కాజీపేట అర్బన్: భూక్రయవిక్రయాల్లో ముఖ్య భూమిక పోషించడమే కాకుండా భూమిపై హక్కు సాధించుకునేందుకు తోడ్పడే దస్తావేజులతో దందా జరుగుతోంది. పాత స్టాంప్ పేపర్లను.. కొత్త ధరతో విక్రయిస్తున్నారు. ఇటీవల ఆన్‌లైన్ స్టాంప్ పేపర్ల విక్రయాలపై రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో పాత స్టాంప్ పేపర్లపై భూఆక్రమణదారులు దృష్టిపెట్టడంతో ఉమ్మడి జిల్లాలో గిరాకీ పెరిగింది. ఇదేఅదనుగా పాత స్టాంప్ పేపర్లకు కొత్త రేటు తీసుకుంటూ విక్రయిస్తున్నారు.

548 మంది స్టాంప్ వెండర్లు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 548 మంది స్టాంప్ వెండర్లు 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిని టార్గెట్ చేసుకుని స్టాంప్ పేపర్ల విక్రయాలను కొనసాగిస్తున్నారు. కాగా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ 5 శాతం కమిషన్‌తో 20, 50, 100 రూపాయల నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్లను వెండర్లకు విక్రయిస్తుంటారు. అదనపు ఆదాయం కోసం కొంత మంది స్టాంప్ వెండర్లు పాత డేట్స్‌లోని స్టాంప్ పేపర్లను బ్లాక్ చేసి ఎక్కువ డబ్బులకు విక్రయిస్తున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఏడాదికి 8 కోట్ల ఆదాయం ఖజానాకు సమకూరుతోంది.

వంద విలువకు.. రూ.10వేల పైన ..

వంద రూపాయల విలువ కలిగిన పాత స్టాంప్ పేపర్‌కు గిరాకీ పెరిగింది. దీనికి రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు కూడా చెల్లించేందుకు సిద్ధమవుతున్నారంటే.. దందా ఏ స్థాయిలో కొనసాగుతున్నదో అర్థం అవుతోంది. పాత డేట్స్‌తో కూడిన పేపర్లను కొనుగోలు చేసి పాత తేదీల్లో భూమిని కొనుగోలు చేసినట్లు నోటరీల వద్ద రాయించుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇంపౌండింగ్ చేసుకుంటూ భూఆక్రమణలకు పాల్పడుతున్నారు.

అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆన్‌లైన్ విధానం..

స్టాంప్ పేపర్ల అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చాం. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లైసెన్స్‌డ్ స్టాంప్ వెండర్లకు జూన్ 20వ తేదీన ఆన్‌లైన్ విక్రయాలపై అవగాహన కల్పించాం. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో స్టాంప్ పేపర్ల విక్రయాలను కొనసాగిస్తే చర్యలు తీసుకుంటాం.

– హరికోట్ల రవి, జిల్లా రిజిస్ట్రార్

అధికార పార్టీ నాయకుల భూకబ్జా..

● ఎమ్మెల్యే పేరుతో బోర్డులు..
● భూయజమానుల ఆరోపణ



పాస్ పుస్తకాలను చూపుతున్న యజమానులు

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని జనగామ రోడ్డులో గల ఎస్‌ఆర్ పెట్రోల్ పంపు ఎదుట, పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న వ్యవసాయ భూమిని పలువురు అధికార పార్టీ నాయకులు ఆక్రమిస్తున్నారని భూయజమానులు మార్క అంజయ్య, ఈశ్వరయ్య, కిషన్ అన్నారు. ఈమేరకు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని 580, 582 సర్వేనంబర్లలో 4 ఎకరాల పట్టా భూమిని తమ పూర్వీకుల నుంచి సాగుచేసుకుంటున్నామన్నారు. అయితే ఆ భూమిలో అధికార పార్టీ నాయకుడు గిరబోయిన అంజయ్య ప్రవేశించి పలువురు బడా నాయకులకు ప్లాట్లు ఇప్పించి తాను కూడా ఓ ప్లాటును తీసుకుని వారి వారసుల పేరున రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారన్నారు. అనంతరం జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పేరున కాలనీ ఏర్పాటు చేస్తున్నట్లు బోర్డును కూడా ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటి వరకు తమ తాతలు, ముత్తాతలు, తండ్రులు ఎవరైనా ఆ భూమిని అమ్మినట్లు డాక్యుమెంట్లు తీసుకువస్తే స్వచ్ఛందంగా వారికి ఇస్తామన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖమ్మం సభకు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులపై దాడి

● ఓ వ్యక్తి తలకు తీవ్ర గ్రాయాలు



దాడిలో గాయపడిన భూక్య సోమన్న

మరిపెడ రూరల్: ఖమ్మంలో తలపెట్టిన రాహుల్ గాంధీ జనగర్జన సభకు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులపై బీఆర్‌ఎస్ కార్యకర్తలు దాడిచేయగా ఒకరి తలకు తీవ్ర గాయలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం మూలమర్రితండ జీపీ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. గాయాలైన బాధితుడు భూక్య సోమన్న కథనం ప్రకారం.. ప్రజాగర్జన సభకు మూలమర్రితండా నుంచి డీసీఎంలో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్తున్న క్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు భూక్య రఘు మరికొందరు డీసీఎంకు ఎదురుగా వచ్చి అడ్డుకున్నారు. సభకు వెళ్లవద్దని వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య తోపులాట.. ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఈ క్రమంలో రఘు అనే బీఆర్‌ఎస్ నాయకుడు బీరు సీసాతో భూక్య సోమన్న తలపై బలంగా కొట్టినట్లు బాధితుడు పేర్కొన్నాడు. క్షతగాత్రున్ని స్థానికులు మరిపెడలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయంపై దాడి చేసిన వ్యక్తి రఘుపై మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సోమన్న తెలిపాడు.

కోర్టుకు నిందితుల సరెండర్

బచ్చన్నపేట: రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య నిందితులను విచారణ అనంతరం పోలీసులు ఆదివారం కోర్టులో సరెండర్ చేశారు. గిరబోయిన అంజయ్యతో పాటు ఆయనకు సహకరించిన సుపారీ గ్యాంగ్ సభ్యులను పోలీసులు ఇటీవల కస్టడీలోకి తీసుకున్నారు. మూడు రోజుల నుంచి నిందితులను విచారించగా పలువురు ప్రధాన నిందితుల పేర్లు బయటకు వచ్చాయి. విచారణ అనంతరం అనుమానితులను కోర్టుకు తరలించారు. రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్యను హత్య చేసిన కేసులో అంజయ్యను విచారిస్తుండగా తన బావమరిది భార్య సుభద్రను కూడా హత్య చేసినట్లు ఆయన ఒప్పుకోవడంతో ఆ కేసును మళ్లీ విచారిస్తున్నారు. సుభద్ర మృతదేహానికి రీ-పోస్టుమార్టం నిర్వహించాలని పోలీసులు నిర్ణయించడంతో వైద్యాధికారులు నాలుగు రోజులు గడువు కోరినట్లు సమాచారం. ఆ కేసుతో కూడా పలువురిని రిమాండ్‌కు తరలించనున్నట్లు చర్చ జరుగుతోంది. అంజయ్య.. రెండు హత్యలను చేయించడంతో పోలీసులకు ఏ హత్య కేసులో అనుమానం వచ్చినా ఆయనను కస్టడీకి తీసుకోవడానికి అనుమతులు ఉన్నట్లు సమాచారం. సుభద్ర మృతదేహానికి రీ-పోస్టుమార్టం నిర్వహించే సమయంలో కీలక నిందితులను మళ్లీ అదుపులోకి తీసుకుని మరింత సమాచారాన్ని రాబట్టడమే లక్ష్యంగా పోలీసులు ముందుకెళ్తున్నారు. ఈ హత్యకు సహకరించిన వారు కోర్టు కెళ్లడం ఖాయమని పలువురు పేర్కొంటున్నారు.

కుమారుడి మృతిని తట్టుకోలేక..

● ఆత్మహత్యకు తల్లి యత్నం
● ఎంజీఎంకు తరలింపు
● పరిస్థితి విషమం ● గార్లలో ఘటన

గార్ల: నవమాసాలు మోసి అల్లారుముద్దగా పెంచిన కుమారుడు ఐదు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోవడంతో ఆ పేరుబంధం తల్లడిల్లింది. తన కుమారుడు లేని బతుకు తనకెందుకని మనస్తాపానికి గురైన తల్లి.. తానూ ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన ఆదివారం గార్ల మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మండల కేంద్రం పుట్టకోట బజారుకు చెందిన వేపచేదుల శివ(16) ఐదు రోజులు క్రితం తల్లి ధనలక్ష్మి మందలించిందని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే నీ వల్లే కుమారుడు శివ మృతిచెందాడని భర్త, చుట్టుపక్కల వారు ధనలక్ష్మిని నిలదీయడంతో తట్టుకోలేక బాత్‌రూమ్ లోకి వెళ్లి ఆత్మహ్యతకు యత్నించింది. తల్లి బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఇంకా రావడం లేదని కుమార్తె తలుపు కొట్టగా ఎంతకూ తీయలేదు. దీంతో బాత్‌రూమ్ తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ధనలక్ష్మి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే క్షతగాత్రురాలిని గార్ల సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు. ప్రస్తుతం ధనలక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



లీల (ఫైల్)

చెన్నారావుపేట: వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని పదహారు చింతల్ తండాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇదే తండాకు చెందిన మాలోతు కిషన్ భార్య లీల గత నెల 29న మేస్త్రీ పని నిమిత్తం ఇంటి నుంచి వరంగల్‌కు వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. దీంతో కిషన్.. బంధువులు, తెలిసిన వారి వద్ద వాకబు చేస్తే ఆచూకీ లభించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

నిద్రిస్తున్న మహిళపై కుక్కల దాడి

● తీవ్రగాయాలు, ఎంజీఎం తరలింపు

పర్వతగిరి: ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న మహిళపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రంలోని అల్లూరి కాలనీకి చెందిన చిదురు వెంకన్న, పూలమ్మ దంపతులు ఇంటి ఆవరణలో నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో తెల్లవారు జామున పూలమ్మపై కుక్కలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో చేయిపై తీవ్రంగా కాట్లు పడ్డాయి. రక్తస్రావం బాగా కావడంతో వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం తరలించారు.

మాజీ సైనికుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడిగా భిక్షపతి



భిక్షపతిని సన్మానిస్తున్న మాజీ సైనికులు

జనగామ రూరల్: మాజీ సైనికుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మారచర్ల భిక్షపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కెప్టెన్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 33 జిల్లాల నుంచి సైనికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా దండ్యాల కరుణాకర్‌రెడ్డి, సభ్యులుగా ప్రవీణ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి మాజీ సైనికుడికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు.

నలుగురిని కాపాడిన గంగపుత్రులు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరిలో ఆదివారం వరంగల్ జిల్లా కేంద్రం నుంచి పుణ్యస్నానాలు చేయడానికి వచ్చిన నలుగురు నీటిలో మునిగిపోతుండగా గంగపుత్రలు(జాలర్లు) కాపాడారు. కుటుంబ సభ్యులతో వచ్చిన వారు స్నానాలు చేస్తూ లోతుప్రవాహంలోకి వెళ్లారు. ఒకరినొకరు పట్టుకొని నీటిలో మునిగిపోతుండగా గమనించిన గంగపుత్రులు ఈదుకుంటూ వెళ్లి బైరి కార్తీక్ (16)తో పాటు మరో ముగ్గురిని రక్షించి ఒడ్డుకు చేర్చారు.

గోదావరి వద్ద కొరవడిన కాపలా..

ఇలా నిత్యం నీటిలో మునిగి పోతున్న సంఘటనలు జరుగుతున్నా పోలీసులు రక్షణ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వర్షాకాలంలో గోదావరి పెరుగుతూ..తగ్గుతూ ఉంటుంది. దీనిని అంచనా వేయకుండా యువకులు నీటిలోకి దిగుతుండడంతో ప్రమాదాలకు దారితీస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చెన్నారావుపేట: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం రాత్రి మండలంలోని అమీన్‌పేట శివారులో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం జీడిగడ్డ తండాకు చెందిన చెందిన భూక్య ప్రసాద్, అతడి స్నేహితుడు ద్విచక్రవాహనంపై నెక్కొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నెక్కొండ నుంచి నర్సంపేటకు ఎదురుగా వస్తున్న కారు అతి వేగంతో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో బైక్‌పై వస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కందిగడ్డ తండాకు చెందిన గుగులోతు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దర్శనానికి వెళ్తూ కనిపించని లోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



బాలమణి, శ్రీహన్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం వనదేవతల దర్శనానికి వెళ్తున్న క్రమంలో డ్రైవర్ అజాగ్రత, అతివేగం వల్ల ఓ మహిళ మృతి చెందారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన డ్రైవర్.. అదుపు తప్పి కారును రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో మహిళ తీవ్రగాయాలకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామానికి చెందిన కస్తూరి నవీన్‌కాంత్, తన భార్య శ్వేత, పిల్లలు శ్రీహన్, ఆయాన్, తల్లి బాలమణి, అత్తమామలు పద్మవతి, విశ్వనాథ్‌తో కలిసి శనివారం రాత్రి మేడారానికి కారులో బయలు దేరారు. ఆదివారం తెల్లవారు జామున పస్రా దాటిన తర్వాత తోగు సమీపంలో డ్రైవర్ కారును అజాగ్రతగా, అతివేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో బాలమణి, శ్రీహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను వెంటనే 108లో ములుగు ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలమణి (55)మృతి చెందింది. శ్రీహన్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ తరలించారు. దీనిపై నవీన్‌కాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

పనికి వెళ్లొస్తూ..

● రోడ్డు ప్రమాదంలో కొడుకు దుర్మరణం
● తండ్రికి తీవ్రగాయాలు.. ఖమ్మం ఆస్పత్రికి తరలింపు
● మృతుడికి కానిస్టేబుల్ పరీక్షలో మెరిట్ మార్కులు



వేణు (ఫైల్)

గార్ల: అటు చదువు.. ఇటు కుటుంబ పోషణ.. రెండింటిలో తనవంతు బాధ్యత నిర్వర్తిస్తున్న ఓ విద్యార్థిని మృత్యువు వెంటాడింది. రోడ్డు ప్రమాద రూపంలో కబలించింది. దీంతో చేతికి అందివచ్చిన కుమారుడు తమ కష్టాలు తీర్చుతాడని భావించిన ఆ తల్లిండ్రులకు తీరని శోకం మిగిలింది. గ్రామస్తుల కథనం ప్రకారం మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన తండ్రికొడుకులు నూనావత్ కేవుల్యా, వేణు(24) బైక్ పై సెంట్రింగ్ పనికి ఖమ్మం జిల్లా కూసుమంచికి వెళ్లారు. పని ముగిసిన అనంతరం బైక్ పై స్వగ్రామానికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో వేణు అక్కడికక్కడే మృతిచెందాడు. కేవుల్యాకు తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా, వేణు ఇటీవల ప్రకటించిన పోలీస్ కానిస్టేబుళ్ల ఫలితాల్లో 133 మెరిట్ మార్కులు సాధించాడు. ఎస్టీ కోటాలో మృతుడికి ఖచ్చితంగా కానిస్టేబుల్ ఉద్యోగం వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. చదువులో, కుటుంబ పోషణలో తనవంతు బాధ్యత నిర్వర్తిస్తున్న వేణు మృతి చెందడం కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులను కంటితడికి గురిచేసింది. తండ్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనతో పినిరెడ్డిగూడెంలో విశాదఛాయలు అలుముకున్నాయి.

జనగామ జిల్లా కేంద్రంలో యువకుడు..

జనగామ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా.. మరొకరికి గాయాలైన ఘటన జనగామ జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని బచ్చన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన నిడిగొండ శ్రీను, కొడవటూర్ గ్రామానికి చెందిన రాసూరి అజయ్ ద్విచక్రవాహనంపై రఘునాథపల్లి నుంచి జనగామకు వస్తున్నారు. ఈక్రమంలో వాహనాన్ని వేగంగా నడపడంతో అదుపుతప్పి డివైడర్ మధ్యలో ఉన్న కరెంట్ స్తంభానికి ఢీ కొనడంతో బైక్ వెనక కూర్చున్న నిడిగొండ శ్రీను(20) ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న అజయ్‌కు చేయి విరిగి తీవ్ర గాయలు కాగా జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘనటపై కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మెడికల్ సీట్ల పేరుతో మోసం

● వ్యక్తి అరెస్ట్.. రూ.3లక్షల నగదు స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ

కాజీపేట: మెడికల్ సీట్లు ఇప్పిస్తానని పలువురిని నమ్మించి రూ.లక్షల్లో దండుకుని మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన చాగంటి నాగసాయి శ్రీనివాస్(53) తనకున్న పరిచయాలతో వరంగల్‌కు చెందిన బరిగెల విజయ్‌కుమార్ కూతురికి ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని నమ్మించి వారి నుంచి రూ.9 లక్షల వరకు వసూలు చేశాడు. సీటు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన విజయ్‌కుమార్ సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయగా ఆయన స్పందించి టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దించారు. వారు నాగసాయి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.3లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. హనుమకొండ ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు అల్లం రాంబాబు, కె.శ్రీనివాస్‌రావు, ఎస్సైలు జి.రమేష్, పెండ్యాల దేవేందర్, లవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు చేర్చిన ‘సఖి’



మంజులను అప్పగిస్తున్న సెంటర్ నిర్వాహకులు

కాజీపేట అర్బన్ :‘సఖి’ వన్‌స్టాప్ సెంటర్.. మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళను కుటుంబ సభ్యులకు చెంతకు చేర్చింది. సెంటర్ నిర్వాహకుల కథనం ప్రకారం హనుమకొండ నయీంనగర్‌కు చెందిన ఎర్ర మంజుల మతిస్థిమితం కోల్పోయి 2022 డిసెంబర్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు హనుమకొండ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా సమాచారం సేకరించిన హనుమకొండ జిల్లా సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి.. దేశవ్యాప్తంగా మహిళలకు అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసి వన్‌స్టాప్ సెంటర్ వాట్సాప్ గ్రూప్‌ల్లో పంపించారు. ఈక్రమంలో మధ్యప్రదేశ్‌లోని రేవా ప్రాంతంలో మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ సంచరిస్తున్నట్లు రేవా ప్రాంత వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు గుర్తించారు. అనంతరం మహిళను వైద్యం నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మహిళ మానసిక స్థితి మెరుగుపడడంతో తన పేరు ఎర్ర మంజుల అని, తనది హనుమకొండ నయీంనగర్ అని వివరాలు తెలిపింది. దీంతో హనుమకొండలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌కు రేవా వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు సమాచారం అందజేశారు.

8 నెలల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు..

మతిస్థిమితం కోల్పోయి హనుమకొండ నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్లిన మహిళను సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు.. సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి, కేస్ వర్కర్ వినీల, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

● పుల్లెల గోపీచంద్



సమావేశంలో మాట్లాడుతున్న గోపీచంద్

జనగామ రూరల్: గొప్ప క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణ క్రీడాకారులు పట్టుదలతో జాతీయ స్థాయిలో రాణించాలని రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ పుల్లెల గోపీచంద్ అన్నారు. స్థానిక బతుకమ్మకుంటలోని వైఎస్‌ఆర్ భవన్‌లో ఉమ్మడి వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పింగిళి రమేష్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత క్రీడలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. నిరంతరం సాధనతోనే ఇది సాధ్యమని సూచించారు. జనగామ జిల్లాలో గొప్ప క్రీడాకారులు ఉన్నారని వారిని వెలికితీసి జాతీయ స్థాయిలో రాణించేలా ప్రాత్సహించాలని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి క్రీడలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోపగోని సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కైరిక హనుమంతారావు, కోశాధికారిగా మార్యాల రమేష్, ఉపాధ్యక్షుడుగా తాళ్లపల్లి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా మైకేల్, కార్యవర్గ సభ్యులుగా శ్యాంశం, శేఖర్, అనిల్‌కుమార్, రాజు, మనోజ్‌కుమార్, అశోక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

పంటలను కాపాడుకోవడానికి విశ్వప్రయత్నం



బిందె, క్యాన్లతో నీళ్లు పోస్తున్న రైతు

మల్హర్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఇప్పటికే సాగు చేసిన కూరగాయ పంటలను కాపాడుకోవడానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొండపేట జీపీ పరిధి కుంభంపల్లిలో ఓ రైతు కుటుంబం విశ్వప్రయత్నం చేస్తోంది. గ్రామానికి చెందిన కుంభం తిరుపతి, లత దంపతులు 20 గుంటల భూమిలో అల్చింద, బీర తదితర కురగాయల పంటలు సాగు చేశారు. గింజలు నాటినప్పటి నుంచి సక్రమంగా వర్షాలు కురవక పోవడంతో అక్కడక్కడా మొలకెత్తాయి. అవికూడా నీరులేక చనిపోతున్నాయి. దీంతో వాటిని బతికించుకోవడానికి దంపతులు ఇంటి నుంచి బిందెలు, క్యాన్లలో నీటిని తీసుకవచ్చి మొక్కలకు, గింజలు నాటిన ప్రదేశంలో పోస్తున్నారు. ఈ గ్రామంలో కొనెళ్లుగా రైతులు కూరగాయలు పంటలను అధికంగా పడిస్తుడంటంతో ‘కూరగాయల కుంభంపల్లి’ అనే పేరు వచ్చింది.